క్లుప్తంగా

నేడు నగర పంచాయతీలో గడప గడపకూ..

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ 7వ వార్డులో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరు కావాలన్నారు.

ఆ చిన్నారుల సేవా స్ఫూర్తి ఆదర్శనీయం


ఔషధీకృత చలివేంద్రంలో సేవలందిస్తున్న చిన్నారులు

అమలాపురం టౌన్: సాధారణంగా పరీక్షలయ్యాక స్కూళ్లకు ఇచ్చే సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళదామా..? ఏదైనా వినోద యాత్రకు వెళదామా...? లేదా సమ్మర్ కోచింగ్ క్యాంపులకు వెళ్లి ఏదైనా నేర్చుకుందామా..? అని ఆలోచించే నేటి పిల్లల్లో ఆధ్యాత్మిక, సామాజిక సేవలో గడుపుదామనుకునే వారు బహు తక్కువే ఉంటారు. గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక నల్లవంతెన–ఎర్రవంతెన బైపాస్ రోడ్డులో దక్షిణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రంలో 8 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వయసున్న 9 మంది విద్యార్థులు గత రెండు నెలలుగా పాదచారులు, వాహన చోదకులకు దాహార్తిని తీర్చే సేవలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు లింగోలు దత్త ఈశ్వర్ సాయి, రామసాయి, లక్ష్మణ సాయి, యశ్వంత్ అభిరామ్, సాయి శ్రీవల్లి, వర్మ, చాగంటి నిహాల్ రామ్, త్సవటపల్లి తేజ, కొమానపల్లి ధన్విల సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని పట్టణవాసులు అభినందిస్తున్నారు.

భగవద్గీత శ్లోకాలపై పిల్లలకు శిక్షణ

అమలాపురం టౌన్: భజరంగ దళ్, సప్తాహిక్ మిలన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆదివారం సాయంత్రం రెండు గంటల పాటు అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరి మండపంలో పిల్లలకు భగవద్గీత శ్లోకాలు, నైతిక విలువలపై శిక్షణనిస్తున్నట్లు భజరంగ్ దళ్ జిల్లా ప్రతినిధి శిరంగు నాయుడు తెలిపారు.

తాగునీటిలో తోక పురుగులు


బీసీ ఏరియాకు సరఫరా చేసిన రంగు మారిన నీటిలో తోక పురుగులు

అల్లవరం: గుండెపూడి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిలో శుద్ధత లోపించింది. ఓహెచ్ ఆర్ ట్యాంకులు శుభ్రం చేయక తాగునీటిలో తోక పురుగులు కనిపిస్తున్నాయి. దేవగుప్తం సచివాలయం పరిధిలో బీసీ ఏరియాకు ఆదివారం సరఫరా చేసిన తాగునీరు రంగు మారి, తోక పురుగులు దర్శనమివ్వడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి


టీ 12 క్రికెట్ టోర్నీ ట్రోఫీ అందుకున్న కేవీఆర్ జట్టు

యానాం: యువత విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న టీ 12 క్రికెట్ టోర్నీ బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీ 12 క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌లో కేవీఆర్ జట్టు విజయం సాధించింది. మొదటి బ్యాటింగ్ చేసిన కేవీఆర్ జట్టు 7 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అగ్ని లయన్స్ జట్టు 76 పరుగులకు ఆలౌట్ అయ్యింది. సియోచమ్ ట్రోఫీ–2023 సైతం కేవీఆర్ జట్టు కైవసం చేసుకుంది. రన్నర్స్‌గా రామా యూత్–ఎ జట్టు, తృతీయ స్థానంలో ఆర్‌వైసీ జట్టు నిలిచింది. విజేతలకు లక్ష్మణ్ ప్రవీణ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శేరు నూకరాజు, జేఈ కె.నాగరాజు, ఐఆర్‌బీ ఎస్‌ఐ అశోక్, పంతగడ సుమన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హరిత నగరంగా అమలాపురం

- జగనన్న హరిత నగరాల్లో భాగంగా ఆధునీకరణ
- రూ.45 లక్షలతో పచ్చని సొబగులు


పచ్చదనం సంతరించుకోనున్న అమలాపురం పట్టణం


గ్రీనరీ బెల్ట్ కానున్న మెయిన్ రోడ్డు డివైడర్లు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణాన్ని జగనన్న హరిత నగరం పేరుతో నిలువెల్లా పచ్చదనంతో సుందరీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జగనన్న హరిత నగరాల పథకంలో భాగంగా అమలాపురానికి రూ.45 లక్షలు విడుదలయ్యాయి. ఈ నిధులతో పట్టణంలోని డివైడర్లు, ఖాళీ స్థలాలు, రోడ్ల చెంత ఇలా ప్రభుత్వపరంగా ఎక్కడ జాగా ఉన్నా పచ్చదనంతో నింపుతూ సుందరీకరణ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది. టెండర్లు పూర్తవ్వగానే పనులు మొదలు పెట్టేందుకు మున్సిపాలిటీ సన్నాహాలు చేస్తోంది.

పచ్చదనం.. సుందరీకరణ..

- హరిత నగరంలో భాగంగా తొలుత పట్టణంలో హైస్కూలు సెంటరు నుంచి ఈదరపల్లి వంతెన వరకూ మెయిన్ రోడ్డు మధ్యలో కిలోమీటరున్నర దూరం విస్తరించి ఉన్న డివైడర్లను గ్రీనరీ బెల్ట్‌గా తీర్చిదిద్దనున్నారు. హరిత నగరంలో భాగంగా ఈ డివైడర్లలో అరుదైన మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే డివైడర్ల మధ్య ఉన్న వ్యాపార ప్రకటనల బోర్డులను తొలగిస్తున్నారు. డివైడర్లు పట్టణానికి ఓ పచ్చని తోరణంలా ఉండేలా ప్లాన్ చేశారు.
- స్థానిక నల్లవంతెన నుంచి జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వెళ్లే దాదాపు కిలోమీటరు ఉండే ప్రధాన రోడ్డుకు రెండు వైపులా పచ్చని మొక్కలు నాటనున్నారు.
- పట్టణంలో ఉన్న ప్రధాన రోడ్ల చెంత అవకాశం ఉన్న జాగా మేర మొక్కలు నాటి సుందరీకరించనున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్ వంటి నగరాల్లో పచ్చని మొక్కలను తీర్చిదిద్దిన నమూనాలను మున్సిపల్ అధికారులు రప్పించుకుని గ్రీనరీ కోసం ఓ ప్రణాళికను సిద్ధం చేసుకుని అందుకు తగ్గట్టుగా సమాయత్తమవుతున్నారు.

సందేశాత్మక చిత్రాలతో వాల్ పెయింట్లు

జగనన్న హరిత నగరంలో భాగంగా తొలుత పరిసరాలను, ప్రధాన రోడ్లను పచ్చదనంతో నింపడం ఒక ఎత్తు అయితే రోడ్ల చెంత ఉండే గోడలపై పచ్చదనం, పర్యావరణం సందేశాలతో కూడిన చిత్రాలు గీసి, నినాదాలు రాసి సుందరీకరించనున్నారు. దీని వల్ల పట్టణం సుందరంగానే కాకుండా పచ్చదనం పరిడవిల్లేలా చేయడమే ఈ పథకం లక్ష్యం. పిల్లలు, పెద్దలతో పాటు అన్ని వయసుల వారిలో పచ్చదనం, పర్యావరణపరంగా పరివర్తన తీసుకొచ్చేలా వాల్ పెయింట్లతో రోడ్లు, వంతెన వద్ద ఉండే గోడలను సందేశాత్మక చిత్రాలు, నినాదాలతో నింపనున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ రోడ్ల చెంత పలు ప్రాంతాల్లో అధునాతన మరుగుదొడ్లు నిర్మించి క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) దిశగా అడుగులు వేస్తున్న అమలాపురం జగనన్న హరిత నగరంతో బ్యూటిఫికేషన్, గ్రీనరీ దిశగా కొత్త సొబగులు అద్దుకోనుంది.

నెల రోజుల్లో పనులు మొదలు పెడతాం

జగనన్న హరిత నగరంలో భాగంగా మున్సిపాలిటీకి మంజూరైన రూ.45 లక్షలతో ఇప్పటికే పచ్చదనం, సుందరీకరణ పరంగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్న దానిపై ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. నెల రోజుల్లో హరిత నగర నిర్మాణ పనులు మొదలు పెడతాం.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

కౌన్సిలర్ రాజేష్‌కు మంత్రి విశ్వరూప్ పరామర్శ


కౌన్సిలర్ రాజేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొవ్వాల రాజేష్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం పరామర్శించారు. రాజేష్ తల్లి సూరమ్మ చిత్రపటానికి మంత్రి విశ్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, రాష్ట్ర పార్టీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, దొమ్మేటి రాము తదితరులు కౌన్సిలర్ రాజేష్‌ను పరామర్శించారు.

పద్మనాభరావు మృతి బాధాకరం

అమలాపురం రూరల్: ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి పద్మనాభరావు మృతి బాధాకరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మద్దాలవారిపేటలో పద్మనాభరావు కుటుంబ సభ్యులను ఆయన ఆదివారం పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. పద్మనాభరావు చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించినవారిలో 14 వార్డు కౌన్సిలర్ నాగరపు వెంకటేశ్వరరావు, నూకపెయ్య గంగాధరరావు, పరమట నాగరాజు తదితరులున్నారు.

విద్యార్థులు పుస్తక జ్ఞానాన్ని పెంచుకోవాలి


శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు


శిక్షణ శిబిరంలో తాము తయారు చేసిన వస్తువులతో విద్యార్థులు


విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఉప్పలగుప్తం: విద్యార్థులు స్థానికంగా ఉన్న గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం, భీమనపల్లి గ్రంథాలయాల్లో ప్రభుత్వం విద్యార్థులకు మే 8 నుంచి జూన్ 11 వరకూ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి రత్నకుమారి, నాగులపల్లి శేషవేణి, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, సలాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణంలో...

అమలాపురం టౌన్: స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గత నెల రోజులుగా విద్యార్థులకు జరుగుతున్న ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు మాట్లాడుతూ మండుటెండలను కూడా లెక్క చేయకుండా శిబిరానికి వచ్చి పుస్తక పఠనంపై శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు. శిబిరంలో నిర్వహించిన డ్రాయింగ్, పాటలు, చదరంగం, వ్యాస రచన తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చివరగా శిక్షణ శిబిరంలో తాము తయారు చేసిన పలు రకాల వస్తువులను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ పోలిశెట్టి సత్యనారాయణమూర్తిని సత్కరించారు. సమావేశంలో కవి నల్లా నరసింహమూర్తి, గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ తదితరులు పాల్గొన్నారు.

గోడి గ్రంథాలయంలో...

అల్లవరం: గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాలు ద్వారా విద్యార్థులకు చక్కటి విజ్ఞానాన్ని అందించారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గ్రంథాలయ ముగింపు ఉత్సవాల సందర్భంగా గోడిలోని గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వెళ్లి ప్రపంచ వ్యాప్తంగా జరిగే విషయాలపై అవగాహన పెంచుకుంటే పోటీ పరీక్షల్లో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. అల్లవరం గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ముగింపు సభకు జెడ్పీటీసీ కొనుకు గౌతమి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపీటీసీలు కాండ్రేగుల శ్రీవాణి, నిచ్చెనకోళ్ల మౌనిక, తోట నరసింహరావు, రుద్రరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

అమలాపురం టౌన్: అమలాపురం పోలీసు సబ్ డివిజన్‌లో విధించిన సెక్షన్ 30 అనేది శాంతి భద్రతల నిర్వహణలో సాధారణంగా ఇచ్చే ఉత్తర్వులేనని, దీనిపై కొన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ అన్నారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు ఇబ్బందులేమైనా అనివార్యమవుతాయేమోనన్న ముందు చూపుతో ఈ సెక్షన్‌ను రొటీన్‌గా అమలు చేస్తామని చెప్పారు.

రోడ్ షో, మీటింగ్ ప్రదేశాలను పరిశీలించిన డీఎస్పీ

అమలాపురంలో వారాహి యాత్ర కోసం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అనుమతిని కోరుతూ ప్రతిపాదించిన పట్టణంలోని ప్రదేశాలను డీఎస్పీ అంబికా ప్రసాద్, పట్టణ సీఐ దుర్గాశేఖరరెడ్డితో కూడిన పోలీసు బృందం ఆదివారం మధ్యాహ్నం పరిశీలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవుకు చెందిన కాలే వీర్రాజు ఇటీవల గుండె సంబంధిత సర్జరీ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.2 లక్షల చెక్కును వీర్రాజు కుటుంబ సభ్యులకు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆదివారం అందజేశారు. బోస్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకురాలు పబ్బినీడి మణి తదితరులున్నారు.

నిస్వార్థ సేవాతత్పరుడు దొమ్మేటి


దొమ్మేటి సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణు

తాళ్లరేవు: ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే నాయకుడు మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దొమ్మేటి సంస్మరణ సభను నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు మల్లాడి కృష్ణారావు, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు హాజరై దొమ్మేటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కాదా గోవింద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల స్థితిలో శివమ్‌బాత్


రాజీవ్ బీచ్ వద్ద శివమ్ బాత్


విరిగిపోయిన విగ్రహం కాలు, దంతం

యానాం: గౌతమీగోదావరి తీరానికి పర్యాటకులను ఆకట్టుకునేలా రెండు వైపులా భారీ గజరాజు విగ్రహాలు, మధ్యలో శివలింగం అభిషేకం చేస్తున్నట్లుగా నిర్మించిన శివమ్‌బాత్ శిథిల స్థితికి చేరుకుంటుంది. బీచ్‌కు వచ్చేవాళ్లు రాజీవ్‌బీచ్‌కే హైలెట్‌గా నిలిచే శివమ్‌బాత్ వద్ద జల్లు స్నానం చేసి అనంతరం ఇక్కడే ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. అయితే శివమ్‌బాత్ ఏనుగు బొమ్మల తొండం, దంతం కాలు తదితరమైన భాగాలు శిథిలమై విరిగి వేలాడుతున్నాయి. వీటి పరిస్థితిపై పలువురు స్థానికులు పీడబ్ల్యూడీ అధికారులకు ఫిర్యాదు చేసినా వాటి గురించి పట్టించుకోవడం లేదు. గతంలో మరమ్మతులు చేయించినా అదీ తూతూమంత్రంగా చేపట్టడంతో మళ్లీ యథాస్థితికి చేరుకున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనికి తోడు జల్లు స్నానఘట్టంకు సంబంధించిన పైపులు పనిచేయకపోవడంతో జల్లు స్నానం లేక పర్యాటకులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి శివమ్‌బాత్‌ను పరిరక్షించాలని యానాంవాసులు కోరుతున్నారు.

యువతకు స్ఫూర్తినిచ్చే సామరస్య భవిష్యత్ కావాలి


అమలాపురం ఓం శాంతి పీస్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: యువతకు స్ఫూర్తినిచ్చే శాంతి స్థాపన, సామరస్య భవిష్యత్ కావాలని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ పిలుపునిచ్చారు. ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అమలాపురం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో అమలాపురంలో ఆదివారం ఉదయం జరిగిన బ్రహ్మకుమారీస్ వై 20 పీస్ మార్చ్‌ను స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద 216 జాతీయ రహదారిపై ఎస్పీ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ర్యాలీ ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి సుబ్బారాయుడు చెరువు, హైస్కూలు సెంటరు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు మీదుగా గరిగుంట చెరువు వద్ద నూతనంగా నిర్మించిన నూతన ఓం శాంతి కేంద్ర భవనం వరకూ సాగింది. బ్రహ్మ కుమారీస్ కేంద్ర యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సంయుక్తంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వై 20 సిరీస్ కార్యక్రమంలో భాగంగా అమలాపురంలో పీస్ మార్చ్ ఏర్పాటుచేసినట్లు ఓం శాంతి కేంద్ర ప్రతినిధి బీకే స్వరూప తెలిపారు. శాంతి ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, పి.గన్నవరం పోలీసు సర్కిల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, కిమ్స్ నర్సింగ్ కళాశాల, బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, బాస్కెట్ బాల్ క్రీడాకారులు, ఎన్‌సీసీ క్యాండెట్లు పాల్గొని శాంతి నినాదాలు చేశారు.

యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న స్వామి వివేకానంద యోగాశ్రమ యువకులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న, రక్తం అత్యవసరమైన 10 మంది గర్భిణుల కోసం అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 9 మంది యువకులు ఆదివారం రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువకులు పి.వెంకట్, ఎం.ప్రవీణ్, ఎస్.శ్రీను, సీహెచ్ నవీన్, కేఎస్‌పీ సురేష్, ఎ.ఆనంద్, బి.ఏసురత్నం, టి.అనిల్, ఎస్.శ్రీనివాసనాయుడులు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు యువకులను అభినందించారు. రోగులు, వారి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ


మంగాయమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: తాళ్లరేవు–యానాం బైపాస్ రహదారిలో గత నెల 14వ తేదీన జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చింతపల్లి మంగాయమ్మను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదివారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంగాయమ్మ ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అశోక్ అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకునేలా వైద్యమందించాలని వైద్యులను కోరారు.

మృతుడి కుటుంబీకులకు ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో ఆదివారం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పాటి నరేంద్ర పిల్లలకు శ్రీ నేస్తం సేవా సమితి ఆధ్వర్యాన రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు సమితి సభ్యులు సమకూర్చిన పై మొత్తాన్ని స్థానిక పోస్టాఫీసు కార్యాలయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన డిపాజిట్ పుస్తకాలను రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ మృతుడి పిల్లలకు అందజేశారు.

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక శివారు టి.సావరానికి చెందిన కడలి రాంబాబు కుమార్తె లక్ష్మీ ప్రసన్నకు వైద్య ఖర్చుల నిమిత్తం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి ఆదివారం రూ.27 వేలు ఆర్థిక సాయం చేసింది. ఈ మేరకు ఈ మొత్తాన్ని ఆమె కుటుంబ సభ్యులకు నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ అందజేశారు.

ముగిసిన తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరం


క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బ్లాక్ బెల్ట్‌లు అందజేసిన ఎస్సై చైతన్యకుమార్


అంబాజీపేట: అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత 30 రోజులుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి ఉచిత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసినట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబాజీపేట ఎస్సై ఎ.చైతన్యకుమార్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న 84 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు, 17 మంది తైక్వాండో క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్‌లను అందజేశారు. చైతన్యకుమార్ మాట్లాడుతూ తైక్వాండో వంటి యుద్ధ క్రీడలు నేర్చుకోవడం వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం పెంపొందుతుందన్నారు. క్రీడలను నిరంతరం సాధన చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే అర్హత సాధిస్తారన్నారు. క్రీడలతో పాటు విద్యపై ప్రత్యేక ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎస్సై చైతన్యకుమార్‌ను ఘనంగా సత్కరించారు.

భానుడి భగభగలు


ఉప్పలగుప్తంలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన మెయిన్‌రోడ్డు

ఉప్పలగుప్తం: రోహిణి కార్తె వీడి మృగశిర కార్తె ప్రవేశించినా ఎండలు తగ్గటం లేదు. రోహిణి కార్తెకు మించి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని ఉప్పలగుప్తం, చల్లపల్లి, గొల్లవిల్లి, భీమనపల్లి, ఎస్.యానాం, ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటల సమయం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఆఖరికి సాయంత్రం 6 గంటలు దాటినా ఉక్కబోత తగ్గక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నూతన పీసీసీ అధ్యక్షుడిగా వైథిలింగం



యానాం: పుదుచ్చేరి ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పార్లమెంట్ సభ్యుడు వి.వైథిలింగం నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం నుంచి రావడంతో పాటు గత ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించడం, గతంలో ముఖ్యమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా సుదీర్ఘ కాలం పనిచేసి ఉండడంతో సీనియర్ నేత వైథిలింగం వైపే పార్టీ అధిష్టానం మొగ్గుచూపింది. ఆయన సారథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ వెళ్లనుంది. ఇప్పటికే కర్ణాటక ఎన్నికల్లో విజయంతో జోష్ మీద ఉన్న కాంగ్రెస్ పుదుచ్చేరిలో ఏకైక లోక్‌సభ సీటును తిరిగి కైవసం చేసుకోవాలని యోచిస్తుంది. వైథిలింగం నియామకంపై యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్ హర్షం వ్యక్తం చేశారు.